

జనగామ పట్టణంలో నిర్వహించిన రోడ్డు షోలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి, హాజరైన ప్రజలు

# ప్రచారానికి 'తెర'..

- ముగిసిన ప్రధాన ఘట్టం
- ఆఖరిరోజు హోరెత్తిన ప్రచారం
- జనగామ పట్టణంలో బీఆర్‌ఎస్ భారీ వాహనాల ర్యాలీ, రోడ్డుషో
- పాల్గొన్న అభ్యర్థి పల్లా, మాజీ ఎమ్మెల్సీ బోడకుంటి, కళాకారుడు బిత్తిరి సత్తి

జనగామ, నవంబర్ 28 (నమస్తే తెలంగాణ) : అసెంబ్లీ ఎన్నికల్లో కీలక ఘట్టానికి తెర పడింది. నామినేషన్ల స్వీకరణ పర్వం ముగిసినప్పటి నుంచి గత 18రోజులుగా ప్రచారంతో హోరెత్తిన పల్లెలు, పట్నాల్లో మంగళవారం సాయంత్రం 5గంటల నుంచి మైకులు బంద్ చేశారు. ప్రచార రథాలను పక్కన బెట్టడంతో ఒక్కసారిగా అంతా సైలెంట్ అయ్యింది. ఇక ఆఖరిరోజు ప్రధాన రాజకీయ పార్టీలు ఇంటింటా ప్రచారం, రోడ్‌షోలు, సభలు, సమావేశాలతో బిజీబిజీగా గడిపారు. జనగామ పట్టణంలో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి గెలుపు కోసం ప్రముఖ కళాకారుడు, టీవీ ఫేమ్ బిత్తిరి సత్తి పలు వార్డుల్లో భారీ వాహన ర్యాలీతో రోడ్‌షో నిర్వహించారు. అనంతరం జనగామ ఆర్టీసీ చౌరస్తాలో రోడ్‌షో కార్నర్ మీటింగ్‌లో ప్రచార చివరి అంకంలో బిత్తిరి సత్తి తనదైన శైలిలో చేసిన ప్రచారం సహా పాటలు, తెలంగాణ యాస, భాషలో చేసిన ప్రసంగానికి భారీ స్పందన లభించింది. బిత్తిరి సత్తిని చూసి ఆయన యాస మాటలు వినేందుకు ప్రజలు, యువత, మహిళలు భారీ సంఖ్యలో తరలివచ్చి ఈలలు, చప్పట్లు, జై కేసీఆర్..జైజై తెలంగాణ నినాదాలతో హోరెత్తించారు. స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి నియోజకవర్గాల్లో సైతం అభ్యర్థులు కడియం శ్రీహరి, ఎర్రబెల్లి దయాకర్‌రావు చివరి క్షణాన్ని కూడా వృథా చేయకుండా సాయంత్రం 5గంటల వరకు కూడా గడపగడపనూ తట్టి ఓటర్లను కలిసి గెలిపించాలని అభ్యర్థించారు. స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ కేంద్రం సహా శివునిపల్లి, ఛాగల్లులో కడియం శ్రీహరి, నమిలిగొండ ఆయన కుమార్తెలు రోడ్‌షో ప్రచారం చేశారు. తొర్రూరు పట్టణంలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు వేలాది మందితో రోడ్‌షో ప్రచారం నిర్వహించగా జనం నుంచి భారీ స్పందన లభించింది. జనగామలో అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి రోడ్‌షో ప్రచారంలో బిత్తిరి సత్తి ప్రత్యేక ఆకర్షణగా నిలిస్తే ఆయన తనదైన బాణిలో కేసీఆర్ పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని పేరడీ పాటల రూపంలో వినిపించారు. కేసీఆర్ పాలనలో జరిగిన ప్రగతిని ప్రస్తావిస్తూ..కాంగ్రెస్ పార్టీ ఇస్తున్న డోకా బాజీ గ్యారంటీ పథకాలను ఎత్తిచూపుతూ చేసిన ప్రసంగం ఊర్రూతలూగించింది. జనగామ రోడ్‌షోలో అభ్యర్థి పల్లాతోపాటు బిత్తిరి సత్తి, మాజీ ఎమ్మెల్సీ బోడకుంటి వెంకటేశ్వర్లు, జడ్పీచైర్మన్, జిల్లా బీఆర్‌ఎస్ అధ్యక్షులు పాగాల సంపత్‌రెడ్డి పాల్గొన్నారు.

**పోలింగ్‌కు సర్వం సిద్ధం..**

జిల్లాలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఈనెల 30న జరిగే పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. జనగామ, పాలకుర్తి, స్టేషన్‌ఘన్‌పూర్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుంచి పోలింగ్ కేంద్రాల వారీగా నేడు (బుధవారం) ఈవీఎంలు, వీవీ, బ్యాలెట్ యూనిట్లను ఎన్నికల అధికారులకు పంపిణీ చేయనున్నారు. ఇప్పటికే ప్రతి ఓటరుకు ఎపిక్‌కార్డుల పంపిణీ, నమోదు చేసుకున్న 80ఏండ్లు దాటిన వృద్ధులు, పీడబ్ల్యూడీ (దివ్యాంగుల) ఓటర్లకు హోం ఓటింగ్ పూర్తికాగా, విధుల్లో ఉన్న అధికారులు, సిబ్బంది ఓట్లు వేసేందుకు 29వ తేదీ వరకు పోస్టల్ ఓటింగ్ అవకాశం కల్పించారు. మరోపక్క పెంబర్తి పాత వీవీఐటీలో మూడు నియోజకవర్గాలకు సంబంధించిన ఓట్ల లెక్కింపు (కౌంటింగ్)కు చకచకా ఏర్పాట్లు జరుగుతున్నాయి. మరోపక్క సమస్యాత్మక కేంద్రాల్లో లైవ్ వెబ్‌కాస్టింగ్, మిగిలిన కేంద్రాల్లో సీసీ కెమెరా పర్యవేక్షణలో ఓటింగ్ నిర్వహించేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు.

**జిల్లాలో ఓటర్ల సంఖ్య 7,37,753..**

జిల్లాలో మొత్తం 7,37,753 మంది ఓటర్లకుగాను 3,67,143 మంది పురుషులు, స్త్రీలు 3,70,590మంది, థర్డ్‌జెండర్ 20మంది ఉన్నారు. వాటిలో జనగామ నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,37,108 మంది ఉంటే 1,18,160మంది పురుషులు, 1,18,939 స్త్రీలు, 9మంది థర్డ్‌జెండర్ ఓటర్లు, స్టేషన్‌ఘన్‌పూర్ సెగ్మెంట్‌లో మొత్తం ఓటర్లు 2,49,155 మందికిగాను పురుషులు 1,23.675 మంది, స్త్రీలు 1,25,479 మంది, 1 థర్డ్‌జెండర్, పాలకుర్తి సెగ్మెంట్‌లో మొత్తం ఓటర్లు 2,51,490మందికిగాను పురుషులు 1,25,308మంది, స్త్రీలు 1,26,172మంది, 10మంది థర్డ్‌జెండర్ ఉన్నారు. పోలింగ్ నిర్వహణ, ఓటరు గుర్తింపు కార్డుల పంపిణీ, ఓటరు సమాచార స్లిప్పుల పంపిణీ, బ్యాలెట్ పత్రాలు, ఈవీఎం యంత్రాల కమిషనింగ్ పూర్తిచేసి రిసెప్షన్, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలలో ఆర్వోలకు అప్పగించారు. దివ్యాంగులకు పోలింగ్ కేంద్రంలో ప్రత్యేక ఏర్పాట్లు చేయడం సహా వీల్ చైర్లు, ఉచితంగా వాహన సౌకర్యం, క్యూలైన్‌లో కాకుండా నేరుగా ఓటేసే సౌకర్యం కల్పించారు. జిల్లాలోని మూడు సెగ్మెంట్లకు పంపిణీ చేసేందుకు ఈవీఎంలు, వీవీప్యాట్లు, బ్యాలెట్ యూనిట్లు, ఎన్నికల సామగ్రి అంతా సిద్ధంగా ఉంది. ఈనెల 29న జిల్లాలోని మూడు ఆర్వో కేంద్రాల నుంచి సిబ్బందికి ఎన్నికల సామగ్రి పంపిణీ చేసి అదేరోజు మధ్యాహ్నం నుంచి పోలింగ్ కేంద్రాలకు చేర్చి 30న పోలింగ్ ముగిసిన తర్వాత ఆయా ఆర్వో కేంద్రాల నుంచి ఈవీఎంలు స్వీకరించి అదే రాత్రి కౌంటింగ్ కేంద్రానికి తరలిస్తారు.

**బందోబస్తుకు భారీ బలగాలు..**

జిల్లాలో పూర్తి ప్రశాంతంగా శాంతియుత వాతావరణంలో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించేందుకు పోలీసు యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నది. ప్రతి నియోజకవర్గానికి 3కంపెనీల చొప్పున ఒక్కో కంపెనీ నుంచి 76 నుంచి 77 మంది త్రిపురకు చెందిన బీఎస్ఎఫ్ బలగాలు ఎన్నికల బందోబస్తు పర్యవేక్షణకు వచ్చాయి. ప్రచార సమయం ముగిసిన వెంటనే బయటి నుంచి వచ్చిన వ్యక్తులు సొంత ప్రాంతాలకు వెళ్లేలా పోలీసు అధికారులు చర్యలు చేపట్టారు. ఎన్నికల్లో నిర్భయంగా, పూర్తి స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకునేలా ఓటర్లకు అన్ని రకాల భద్రత కల్పిస్తున్నారు.



పార్టీలోకి ఆహ్వానిస్తున్న డీసీసీబీ వైస్‌చైర్మన్ కుందూరు వెంకటేశ్వర్‌రెడ్డి

## 'బీఆర్‌ఎస్‌కే ప్రజల మద్దతు'

కొడకండ్ల : స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ సహకారంతో పాలకుర్తి నియోజకవర్గాన్ని, కొడకండ్ల మండలాన్ని సమగ్రాభివృద్ధి చేశారని, ప్రతి ఒక్కరూ దయాకర్‌రావుకు ఓటు వేసి బీఆర్‌ఎస్‌కే మద్దతు తెలిపేందుకు సిద్ధంగా ఉన్నారని డీసీసీబీ వైస్ చైర్మన్ కుందూరు వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలకేంద్రంలో డీసీసీబీ వైస్‌చైర్మన్ కుందూరు వెంకటేశ్వర్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్ నాయకుడు తాళ్లపల్లి యాకయ్య ఆధ్వర్యంలో గోసంగి కుల సంఘ సభ్యులు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ అభివృద్ధిని చూసి కారు గుర్తుకు ఓటు వేసి మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. మండల నాయకులు భానుకిరణ్, వీరదాసు నవీన్, వెంకటయ్య పాల్గొన్నారు.

## కడియంకు దివ్యాంగుల ఫోరం మద్దతు

జనగామ, నవంబర్ 28 (నమస్తే తెలంగాణ) : స్టేషన్‌ఘన్‌పూర్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కడియం శ్రీహరికి నవ తెలంగాణ రాష్ట్ర దివ్యాంగుల ఫోరమ్ జిల్లా కమిటీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ మేరకు కడియంను గెలిపించాలని కమిటీ ఏకగ్రీవంగా తీర్మానం చేసి చిల్పూరు గుట్ట దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేసింది. కార్యక్రమంలో జనగామ జిల్లా అధ్యక్షులు పంతులు ప్రభాకర్‌రావు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రాయరావు ఉపేందర్, జిల్లా అధికార ప్రతినిధి కళ్యాణం రాజు, జిల్లా గ్రాడ్యుయేట్ అధ్యక్షుడు పెరబోయిన శ్రీధర్, నర్మెట మండలం అధ్యక్షుడు మోడెం రాజు, జిల్లా నాయకులు కాసు కనకయ్య, కాసర్ల మహేశ్, గంధమల్ల రామకృష్ణ, గుండెబోయిన కుమార్ పాల్గొన్నారు.

## ఝాన్సీరెడ్డి దంపతులకు ఈసీ నోటీసులు

తొర్రూరు, నవంబర్ 28 : పాలకుర్తి కాంగ్రెస్ అభ్యర్థి యశస్వినిరెడ్డి అత్తమామలు ఝాన్సీరెడ్డి, రాజేందర్‌రెడ్డి దంపతులకు తొర్రూరులో మంగళవారం రాత్రి పాలకుర్తి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి నోటీసులు జారీ చేశారు. ఎలక్షన్ కమిషన్ నిబంధనల మేరకు మంగళవారం సాయంత్రం 5గంటల వరకు ఎన్నికల ప్రచారం ముగిసింది. ఆ తర్వాత నియోజకవర్గంలో స్థానికేతరులు, ఓటర్లు కానివారు ఎలాంటి ప్రచారాలు చేయరాదని, ఓటర్లను ప్రలోభాలకు గురిచేయకూడదన్న నిబంధనల ఆధారంగా ఈ నోటీసులు ఇచ్చారు. ఝాన్సీరెడ్డి దంపతులకు ఇక్కడ ఓటు హక్కు లేకపోవడంతో ఎన్నికల నియమావళి ప్రకారం నియోజకవర్గంలో ఉండకూడదని పేర్కొంటూ డీఎస్పీ వెంకటేశ్వరబాబు నేతృత్వంలో పోలీసులు యశస్విని నివాసానికి వెళ్లి అందించారు. కాగా నోటీసులు తీసుకోబోమని పోలీసులతో ఝాన్సీరెడ్డి వాగ్వాదానికి దిగారు. రాజకీయం ఆరోపణలు చేయడంతో విషయం కాస్తా జఠిలంగా మారింది. బీఆర్‌ఎస్ అభ్యర్థిపై కాంగ్రెస్ వాళ్లు చేసిన ఆరోపణలపై బీఆర్‌ఎస్ నేతలు మండిపడుతూ భారత రాజ్యాంగం, చట్టాలపై కనీస అవగాహన లేని వ్యక్తులు ఓటమి భయంతోనే ఎలక్షన్ కమిషన్ నిబంధనలను సైతం ధిక్కరిస్తూ రాజకీయంగా లబ్ధిపొందాలని ఆరోపణలు చేయడం సమంజసం కాదని హితవు పలికారు. పాలకుర్తి నియోజకవర్గ ప్రజలు ఝాన్సీరెడ్డి ఆరోపణలను అర్థం చేసుకోవాలని కోరారు.

## 'మంత్రి దయాకర్‌రావు గెలుపు ఖాయం'

దేవరుప్పుల, నవంబర్ 28 : రాష్ట్రంలో మరోమారు బీఆర్‌ఎస్ ప్రభుత్వం, పాలకుర్తి నియోజకవర్గంలో ఎర్రబెల్లి దయాకర్‌రావు గెలువడం ఖాయమని భారత్ జాగృతి జనగామ జిల్లా అధ్యక్షుడు పసునూరి మురళి తెలిపారు. మండలంలోని మాధాపురంలో మంగళవారం బీఆర్‌ఎస్ శ్రేణులతో కలిసి ఆయన విస్తృత ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ అభ్యర్థి యశస్వినీరెడ్డికి పాలకుర్తిలో జరిగిన అభివృద్ధి కనిపించకపోవడం ఆమె అవివేకానికి నిదర్శనమన్నారు. పాలకుర్తి అభివృద్ధి ప్రదాతపై పోటీకి ఎవరూ రాకపోవడంతో, అమెరికా నుంచి వచ్చిన తనకు గతిలేక కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇచ్చిందనే విషయాన్ని గ్రహిస్తే మంచిదన్నారు. మరోవైపు మాధాపురం బాగోగులు చూడని పీసీసీ సభ్యుడు లక్ష్మీనారాయణనాయక్ దయన్నపై మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రతి కార్యకర్త సైనికునిగా పనిచేస్తూ దయాకర్‌రావును భారీ మెజార్టీతో గెలిపించాలని మురళి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ముత్యం రాజు, ఎస్సీసెల్ నాయకుడు గుర్రం క్రాంతి, మాజీ ఎంపీటీసీ మడికొండ ఎల్లయ్య, బూత్ కన్వీనర్ బోయిని మల్లయ్య, కోఆప్షన్ మెంబర్ భూస్వామి, బీఆర్‌ఎస్ మండల నాయకులు వీరారెడ్డి, అశోక్‌రెడ్డి, వర్రె కొమురయ్య, కుమార్, సోషల్ మీడియా కన్వీనర్ అతిక్ పాషా ఉన్నారు.



మాధాపురంలో ఇంటింటా ప్రచారం చేస్తున్న మురళి

## మద్యం దుకాణాల మూసివేత

జనగామ చౌరస్తా, నవంబర్ 28 : శాసన సభ ఎన్నికల కోడ్ అమల్లో భాగంగా మంగళవారం సాయంత్రం 5గంటల నుంచి ఈ నెల 30వ తేదీ వరకు జిల్లాలోని జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి అసెంబ్లీ నియోజకవర్గాల్లో వైన్సులు, బార్ అండ్ రెస్టారెంట్లను మూసి వేసినట్లు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి ఎస్ కృష్ణప్రియ తెలిపారు. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి ఎవరైనా బహిరంగ మద్యపానం చేసినా, మద్యం దుకాణాలు నడిపించినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. అక్రమ నిలువలు ఉంటే 9014017705కు లేదా టోల్ ఫ్రీ నంబర్ 18004252523కి సమాచారం అందించాలన్నారు.

## పోలింగ్‌కు సర్వం సిద్ధం

**నియోజక వర్గంలో 61సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు**

పాలకుర్తి రూరల్, నవంబర్ 28 : పాలకుర్తి అసెంబ్లీ 100 నియోజకవర్గంలో ఈ నెల 30న నిర్వహించనున్న అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధం చేసినట్లు ఎన్నికల అధికారి, అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ పాలకుర్తి నియోజకవర్గంలో 294పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. నియోజకవర్గంలో మొత్తం ఓటర్ల సంఖ్య 2లక్షల51వేల 490 మంది ఉన్నట్లు తెలిపారు. పురుష ఓటర్లు 1లక్ష 25వేల 308మంది ఉండగా, మహిళా ఓటర్లు 1లక్ష 26వేల 172ఓట్లు ఉన్నాయని తెలిపారు. పోలింగ్ టీంల సంఖ్య 352, పోలింగ్ సిబ్బంది సంఖ్య ప్రొగ్రాం ఆఫీసర్లు పీవోలు 352, ఏపీవోలు 352, సీపీవోలు 704మంది ఉన్నారన్నారు. రూట్ సెక్టార్లు 36, సెక్టార్ ఆఫీసర్లు 43మందిని నియమించామన్నారు. అదనపు బలగాలు బందోబస్తు నిర్వహిస్తామన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144సెక్షన్ అమలులో ఉంటుందని ఆయన తెలిపారు.

## బచ్చన్నపేటలో 38,127 మంది ఓటర్లు

బచ్చన్నపేట, నవంబర్ 28 : మండలంలోని 26 గ్రామ పంచాయతీల పరిధిలో ఈ నెల 30న 38,127 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఇందులో పురుషులు 18,957, మహిళలు 19,169 మంది ఉన్నారు. ఆయా గ్రామాల్లోని 47బూత్‌లలో సకల వసతులు, సౌకర్యాలు కల్పించారు. విద్యుత్తు, తాగునీటి, మరుగుదొడ్లు సౌకర్యం వంటి వసతులు కల్పించారు. తహసీల్దార్ విశాలాక్షి పర్యవేక్షణలో అన్ని పోలింగ్ బూత్‌ల్లో సీసీ కెమరాలు బిగించారు. గ్రామాల వారీగా ఓటర్ల వివరాలు ఈ విధంగా ఉన్నాయి. సాల్వాపూర్‌లో 1140మంది ఓటర్లు, అదేవిధంగా పడమటికేశ్వాపూర్ జడ్పీఎస్ఎస్‌లో 1005, 760, మన్‌సాన్‌పల్లి ఎంపీపీఎస్‌లో 734, ఎంపీపీఎస్ లింగంపల్లిలో 1099, 722, జడ్పీఎస్ఎస్ కట్కూర్‌లో 1,153, 1231, యూపీఎస్ ఆలింపూర్‌లో 770, 726, యూపీఎస్ గంగాపూర్‌లో 479, యూపీఎస్ నాగిరెడ్డిపల్లిలో 768, 708, జడ్పీఎస్ఎస్ కొన్నెలో 1161, 978, యూపీఎస్ దబ్బగుంటపల్లిలో 992, ఎంపీపీఎస్ రామచంద్రాపూర్‌లో 932, ఎంపీపీఎస్ ఇటికాలపల్లిలో 972, 671, ఎంపీపీఎస్ బచ్చన్నపేటలో 939, 612, 885, జడ్పీపీఎస్ఎస్ బచ్చన్నపేటలో 957, 1196, 692, 678, ఎంపీపీఎస్ బసిరెడ్డిపల్లిలో 610, జడ్పీఎస్ఎస్ కొడవటూరులో 904, 765, యూపీఎస్ బండనాగారంలో 560, 843, జడ్పీఎస్ఎస్ కేశిరెడ్డిపల్లిలో 970, 641, ఎంపీపీఎస్ బోనకొల్లూరులో 621, యూపీఎస్ తమ్మడపల్లిలో 1083, ఎంపీపీఎస్ చిన్నరామచర్ల 783, 592, 649, ఎంపీపీఎస్ గోపాల్‌నగర్‌లో 695, ఎంపీపీఎస్ నక్కవానిగూడెంలో 717, ఎంపీపీఎస్ పోచన్నపేటలో 730, జడ్పీపీఎస్ పోచన్నపేటలో 686, పీఎస్ పోచన్నపేటలో 596, 564, 710, ఎంపీపీఎస్ నారాయణపూర్‌లో 766, 682 మంది ఓటర్లు ఉన్నారు. మొత్తం 38,127 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు సకల ఏర్పాట్లు చేసినట్లు తహసీల్దార్ విశాలాక్షి వెల్లడించారు.

## ఎయిర్ ఫోర్స్ అధికారి మృతి

దేవరుప్పుల, నవంబర్ 28 : దేవరుప్పుల ఉన్నత పాఠశాలలో 1986-87 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వవిద్యార్థి ఎయిర్‌ఫోర్స్ గ్రూప్ కమాండర్ కొత్తోజు వెంకటేశ్వరాచారి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఢిల్లీలో సోమవారం జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందినట్టు అతని తోటి పూర్వ విద్యార్థులు తెలిపారు. వెంకటేశ్వరాచారి మృతి విచారకరమన్నారు. ఆయన కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.